క్లుప్తంగా

కొనసాగుతున్న రిలే దీక్షలు



రెంజల్(బోధన్): మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల వెళ్లే లింకు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రెంజల్‌లో రైతులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 44వ రోజు కొనసాగాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మాటిస్తేనే దీక్షలను విరమిస్తామని పేర్కొన్నారు. స్థానిక రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి



బోధన్‌టౌన్(బోధన్): నిజాం దక్కన్ షుగర్స్‌ను నమ్ముకొని బతుకుతున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 6వ రోజు కొనసాగాయి. ప్రభుత్వం కార్మికులు, వారి కుటుంబాల జీవితాలను దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం తీసుకోవాలని కార్మికులు కోరారు.

ప్రశ్నిస్తే చెక్‌పవర్ రద్దు చేశారు



వేల్పూర్: మండలంలోని రామన్నపేట్ గ్రామంలో నిర్మించిన సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత లేదని ప్రశ్నించినందుకు తమ పార్టీకి చెందిన ఉపసర్పంచ్ నవీన్ చెక్‌పవర్‌ను అధికారులు రద్దు చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్న అధికారుల తీరుకు నిరసనగా ఉపసర్పంచ్ పదవికి, వార్డు సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఉపసర్పంచ్ నవీన్ ప్రకటించారు. నాయకులు మల్కన్నగారి మోహన్, ఏలేటి రమేశ్‌రెడ్డి, నవీన్, రాజారెడ్డి, కృష్ణారెడ్డి, రాజేందర్ ఉన్నారు.

జవాన్ల సేవలు మరువలేనివి



వర్ని: దేశం కోసం ఆర్మీ జవాన్లు చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గంగాధర్ గౌడ్ వెల్లడించారు. చందూర్‌లో గురువారం 'నా దేశం- నా మట్టి' కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు రిటైర్డ్ ఆర్మీ జవాన్ విటల్ ఆయన కుటుంబ సభ్యులను సన్మానించారు. అనంతరం జవాన్ల సేవలను కొనియాడారు. నాయకులు భూపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, విగ్నేష్‌రెడ్డి, శివకిరణ్, పాల్దే శ్రీనివాస్, లక్ష్మణ్, మహేష్ పాల్గొన్నారు.

అనాథ పిల్లల సర్వే



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో గురువారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది అనాథ పిల్లల సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు. మున్సిపల్ అధికారులు దిలీప్, సుభాష్ ఉన్నారు.
రుద్రూర్: కోటగిరి ఉమ్మడి మండలంలో అనాథ పిల్లల సర్వే నిర్వహించి, వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీవో మారుతి, హెచ్‌ఈవో గోవర్ధన్, జీపీ కార్యదర్శులు, హెల్త్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి



ఆర్మూర్ : ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న సిబ్బందిని అర్హతకు తగ్గట్లుగా డీపీవో క్యాడర్ కల్పించి, రెగ్యులరైజ్ చేసి జీతాలు పెంచాలని కోరుతూ గురువారం ఆర్మూర్ పట్టణ కేంద్రంలో ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సిబ్బంది వినతిపత్రం అందజేశారు. 16 ఏళ్లుగా ఆరోగ్యశ్రీ ద్వారా రోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. ఆరోగ్యశ్రీ సిబ్బందికి కూడా హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని, విధి నిర్వహణలో సిబ్బంది మరణిస్తే ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. గ్రామ సింహాలు!

- వీధుల్లో కుక్కల స్వైర విహారం
- భయపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పోచంపాడ్‌లో రోడ్డుపై గుంపులుగా కుక్కలు

బాల్కొండ: గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువ అవుతుంది. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని గ్రామాల్లో ఏ గ్రామంలో చూసిన కుక్కల గుంపు కనిపిస్తున్నాయి. దీంతో బయటకు రావాలంటే ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ప్రయాణికులను సైతం కుక్కలు వెంటాడి మరీ దాడి చేస్తున్నాయి. దీంతో బైక్ నడిపే వారు భయాందోళనకు గురవుతు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలా రోజు ఎక్కడో ఓచోట వీధి కుక్కలు రెచ్చి పోతున్నాయి. కాలినడకన వెళ్లే వారి పరిస్థితి గురించి చెప్పనక్కర్లేదు. ఇటీవల పలు గ్రామాల్లో కుక్కలు కాటు వేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టింపులేదు..

వీధి కుక్కల స్వైర విహారంపై పలుమార్లు గ్రామ పంచాయతీల్లో, మండల కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల స్వైరవిహారానికి చెక్ పెట్టే కార్యక్రమాలు చేపట్టే అవకాశం ఉన్నా, వారు పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే కుక్కల బారిన పడి ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను బంధించి అటవీ ప్రాంతాల్లో వదలాలని వేడుకుంటున్నారు.

బయటకు వెళ్లాలంటే భయం..



గ్రామాల్లో వీధి కుక్కలు ఎక్కువగా గుంపులు, గుంపులుగా తిరుగుతూ వెంటపడుతున్నాయి. కాలనీలో బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, వీధి కుక్కలను పట్టుకొని దూర ప్రాంతాలకు తరలించాలి.
– అబ్దుల్ కరీం, పోచంపాడ్

పంటపొలాల పరిశీలన



పంటల నమోదును పరిశీలిస్తున్న డీఏవో



వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

భీమ్‌గల్: జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ గురువారం మండలంలోని మెండోరా గ్రామంలో పర్యటించి, పంటపొలాలను పరిశీలించారు. పంటలపై ఆశించే చీడపీడల నివారణ చర్యలు తీసుకోవాలని ఏఈవోలకు సూచించారు. ఏఈవో నమోదు చేసిన పంటల వివరాలను పరిశీలించారు.
రుద్రూర్/బోధన్: రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం బోధన్, చందూర్, మోస్రా మండలాల్లోని మినార్‌పల్లి, కారేగాం, తిమ్మాపూర్ గ్రామాల్లో పర్యటించి, పంటపొలాలను పరిశీలించారు. వరిలో బాక్టీరియా ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించి రైతులకు సూచనలు చేశారు. తెగులు ఆశించిన పొలం నుంచి నీటిని కింది మడుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. వరి చిరుపొట్ట దశలో ఎకరాకు 25కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును వేయాలని, తెగులు నివారణకు ప్లాంటమైసిన్ 80గ్రా లేదా అగ్రామైసిన్ 80గ్రాను 200లీటర్ల నీటికి కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు నవీన్ కుమార్, పరిమళ, సాయిచరణ్, నరేందర్, కృష్ణ చైతన్య, వెంకట్, రాజ్ కుమార్, సురేష్, శ్వేత ఉన్నారు.

ప్రజలు ప్రలోభాలకు లొంగవద్దు

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్



గిరిజనులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మాక్లూర్: సీఎం కేసీఆర్ ప్రలోభాలకు ప్రజలు లొంగవద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని దుర్గానగర్ కింది తండాలో బుధవారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. అనంతరం గురువారం ఉదయం దుర్గానగర్ కింది తండా, సింగంపల్లితండా, మీది తండాల్లో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ఓటమి పాలైతే ఆయనతో పాటు కుటుంబం అంతా జైల్లో ఊచలు లెక్కపెట్టే పరిస్థితి ఉన్నందున గెలవడానికి ప్రజల్ని మరింత ప్రలోభాలకు గురిచేస్తున్నాదన్నారు. ప్రజలు కేసీఆర్ ప్రలోభాలకు లొంగద్దన్నారు. నాయకులు దేగ పోశెట్టి, గంగాధర్‌గౌడ్, రాజేశ్వర్, వెంకటేశ్వరరావు, రాజు, రవిప్రకాష్, జైల్‌సింగ్, గంగాధర్, సుల్తాన్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నిధులు మంజూరు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపీ అర్వింద్ గురువారం సుమారు రూ.14లక్షల నిధులు మంజూరు చేశారు. బీజేపీ నాయకులు సురేందర్, సుగుణ చిన్నారెడ్డి, సంజీవ్, గంగాధర్, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్, చేపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలోఆయా గ్రామాల సర్పంచ్‌లు సట్లపల్లి సవిత గణేష్, ఇందూర్ సాయన్న, ఎస్ఎంసీ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

క్షత్రియలో వీడ్కోలు సమావేశం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఎంబీఏ చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో హన్మాన్ ఆలయం ప్రహరీ నిర్మాణానికి గురువారం జెడ్పీటీసీ నరోజి గంగారాం భూమిపూజ చేశారు. వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, విండో చైర్మన్ సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మందుల పంపిణీ

రుద్రూర్: కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు గురువారం వైద్య సిబ్బంది నులిపురుగు నివారణ మాత్రలు అందజేశారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, సిబ్బంది జ్యోతి, అనుపమ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

రెంజల్: మండలంలోని దూపల్లి హైస్కూల్‌లో గురువారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాకులకు సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీ మాజీ కౌన్సిలర్ సంగీత ఇటీవల గుండెపోటులో మృతిచెందింది. దీంతో గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే షకీల్ పరామర్శించారు.

ఎమ్మెల్యేకు సన్మానం

బోధన్‌టౌన్(బోధన్): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆర్టీసీ కార్మికులు గురువారం ఎమ్మెల్యే షకీల్‌ను ఆయన నివాసంలో సన్మానించారు. ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, కార్మికులు ఉన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల అందజేత

బోధన్: సాలూర మండలంలోని హుంసా గ్రామస్తులకు సంబంధించిన గృహలక్ష్మి పథకం దరఖాస్తులను తహసీల్దార్ మమతకు గురువారం గ్రామ బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. నాయకులు సంజు పటేల్, ఎంపీటీసీ శివకుమార్, జక్క నాగరాజు, ఆనందరావు, నరేందర్ పాల్గొన్నారు.

నియామకం

వర్ని: బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వర్ని మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శనిగరం కిషన్ నియమితులయ్యారు. బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మందర్న రవిని నియమించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని పలువురు లబ్ధిదారులకు గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పంపిణీ చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా తాళ్లరాంపూర్‌కు చెందిన ఎనుగందుల రాజాపూర్ణనందం గురువారం ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జోగు చిన్న నర్సయ్య(ముప్కాల్), ఉపాధ్యక్షులుగా ఆరెపల్లి నరేందర్(భీమ్‌గల్), ఎలిగేటి మధుకర్(బాల్కొండ), జనరల్ సెక్రటరీగా పోతు ధరణి(కమ్మర్‌పల్లి), ఆర్గనైజ్ కార్యదర్శిగా మాదాస్తు శ్రీనివాస్(వేల్పూర్), జాయింట్ సెక్రటరీగా నిప్పుల నాగరాజు, కోశాధికారిగా వినోద్ ఎన్నికయ్యారు. వీరిని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైగా ఎంపికైన శ్రీసాయికి సన్మానం

కమ్మర్‌పల్లి: ఎస్సై ఉద్యోగానికి ఎంపికైన కమ్మర్‌పల్లికి చెందిన సల్లూరి శ్రీసాయిని కాంగ్రెస్ నాయకులు ముత్యాల సునీల్‌రెడ్డి గురువారం అభినందించారు. పార్టీ మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు సింగిరెడ్డి శేఖర్, గణేష్, నర్సయ్య, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డీలర్లకు కమీషన్ పెంచడంతో గురువారం మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం కేసీఆర్, మంత్రి వీపీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీలర్లు ముక్క అంజయ్యగుప్త, పోతు లింగమూర్తి పాల్గొన్నారు.

నీలాలో మట్టి సేకరణ

రెంజల్(బోధన్): 'నా దేశం- నా మట్టి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నీలా గ్రామంలో గురువారం బీజేపీ నాయకులు మట్టిని సేకరించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలతో పాటు పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణ నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో 75 మొక్కలను నాటారు. మట్టిని దేశ రాజధాని ఢిల్లీకి పంపనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ లోలపు రజని, జెడ్పీటీసీ మేక విజయ, వైస్ ఎంపీపీ యోగేశ్, గోపీకృష్ణ పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



పెర్కిట్(ఆర్మూర్)/మాక్లూర్/రుద్రూర్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి, జీవాలకు టీకాలను పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వేశారు.మాక్లూర్ మండలంలోని కల్లెడి గ్రామంలో పశు వైద్యులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలతో పాటు నట్టల నివారణ మందులను వేశారు.పోతంగల్ మండలం సోంపూర్ గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి



డొంకేశ్వర్(ఆర్మూర్): తమను కూడా ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు డొంకేశ్వర్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఎన్ఎంలు స్రవంతి, సుమలత, జమున, తదితరులున్నారు.
నవీపేట: వైద్యశాఖలో విధులు నిర్వహిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. సెకండ్ ఏఎన్ఎంలు లక్ష్మినర్స్, ప్రియాంక, దీప, సావిత్ర, రత్నమాల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



భీమ్‌గల్: మండలంలోని గోన్‌గొప్పుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, కుంట రమేష్, సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురు..



కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ రుద్రసేన యూత్ యువకులు గురువారం బీజేపీలో చేరారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌట్‌పల్లిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సమక్షంలో పార్టీలో వారు చేరారు. నాయకులు సంతోష్‌రెడ్డి, ఏనేడ్ల బాజిరెడ్డి, అజయ్, రాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే బిల్లులు చెల్లించం



వర్ని: గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించకుంటే బిల్లులు చెల్లించబోమని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు వెల్లడించారు. వర్ని మండల సమావేశము గురువారం ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు అధ్యక్షతన నిర్వహించారు. సభలో పలువు సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. పనిచేయని అధికారులు రాజీనామా చేసి వెళ్లాలని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి అధికారులపై మండిపడ్డారు. అలాగే వివిధ గ్రామాల సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. తెల్లరేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ రాకేష్ సూచించారు. ఎంపీడీవో బషీరుద్దీన్, జెడ్పీటీసీ హరిదాసు, ఎంఈవో శాంతకుమారి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



గొడుగులతో కేసీఆర్ అనే అక్షరాలను ప్రదర్శిస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు



ఆర్మూర్‌లో 108 వాహనాన్ని ప్రారంభించి, డ్రైవింగ్ చేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్: రాష్ట్రంలో ఉచిత వైద్య సేవలను మరింత మెరుగ్గా అందిస్తామని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో గురువారం 108, 102 వాహనాల ప్రారంభం కార్యక్రమం నిర్వహించారు. వాహనాలకు రిబ్బన్ కట్ చేసి ఆయన స్వయంగా డ్రైవింగ్ చేసారు. అనంతరం ఆస్పత్రిలో నిర్వహించే ఉచిత భోజన సదుపాయాన్ని పరిశీలించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, వైద్యులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ...

ఆర్మూర్ మండలం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస ప్రాంగణంలో సెకండ్ ఏఎస్ఎంలకు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉచితంగా గొడుగులను ఎమ్మెల్యే పంపిణీ చేసారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'కమీషన్ కాకతీయ'గా మార్చారు



చెరువు అలుగును పరిశీలిస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకాన్ని కమీషన్ కాకతీయగా మార్చాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. మండలంలోని ఇనాయత్‌నగర్‌లోని నాగులపాటి కుంట చెరువును బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెరువులు, కాలువల నిర్మాణాలు ఇష్టారీతిన చేపట్టడంతో చెరువులోని నీరు పంట పొలాల్లోకి చేరుతున్నాయన్నారు. దీంతో 20 ఎకరాలు పంటకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని అలాగే చెరువుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కుంట భూమారెడ్డి, ఎగుర్ల రవి, జక్కుల మల్లికార్జున్, పర్ష మల్లయ్య, మానాల రాజు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజారెడ్డి సేవలు అభినందనీయం





పేద విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. బాల్కొండలో నిధుల ప్రొసీడింగ్ కాపీలు..

వేల్పూర్: సమాజ సేవకుడు పైపుల రాజారెడ్డి తన స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు చేయూతను అందిస్తున్నారని, ఆయన సేవలు అభినందనీయమని రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం రాజారెడ్డి అందజేసిన ఆర్థిక సహాయాన్ని మంత్రి విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా రాజారెడ్డి సేవను మంత్రి కొనియాడారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

మెండోర మండలం కోడిచెర్ల గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు మంత్రి ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

నిధుల ప్రొసీడింగ్ కాపీల అందజేత

బాల్కొండ/వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల కుల సంఘాల భవనాల నిర్మాణానికి మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆయా సంఘాల సభ్యులకు అందజేశారు. బాల్కొండ, మోర్తాడ్ మండలాలలకు చెందిన 23 గ్రామాలకు రూ. 90 లక్షల నిధుల మంజూరు ఉత్తర్వులను వారికి అందించారు.

కార్మికులపై కక్ష సాధింపు సరికాదు

వర్ని: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ కార్మికులు తమ మాట వినకుండా సమ్మె చేశారని సర్పంచ్ నాగమణి వీర్రాజు, కార్యదర్శి సాయిలు కక్ష సాధింపులకు పాల్పడడం సరికాదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నే సాబ్ పేర్కొన్నారు. జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, గురువారం వర్ని మండల సమావేశాన్ని అడ్డుకున్నారు. ఎంపీపీ మేక శ్రీలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. యూనియన్ నాయకులు సాయి చరణ్, రాజు, సాయిలు, గంగారం, నర్సయ్య, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటి లలితా నామపారాయణం

బాల్కొండ: మండల కేంద్రంలోని అమృతధారా సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి కోటి లలితా నామ పారాయాణం నిర్వహించనున్నారు. ఉదయం, సాయంత్రం వేళాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానాలు నిర్వహించుటకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ఆగష్టు 11నుంచి నవంబర్ 26 వరకు 108 రోజుల నిరంతరం పారాయణం ఉంటుందని పండితుడు నారాయణ హరాచారి అన్నారు. భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

అంబం జీపీ కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్

రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) గ్రామ పంచాయతీ కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కోటగిరి మండలం కొల్లూర్ జీపీ నుంచి బదిలీపై అంబం (ఆర్)కు వచ్చారు.

మంత్రిని కలిసిన డీసీపీ



వేల్పూర్: నిజామాబాద్ అడిషినల్ డీసీపీ (అడ్మిన్ లా అండ్ ఆర్డర్)గా బాధ్యతలు చేపట్టిన జయరాం గురువారం వేల్పూర్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

సినిమాలు — తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1	బ్రో(తెలుగు)-10.40 4.15 9.50 మెగ్-2(తెలుగు) 3డీ-1.35 7.10
స్క్రీన్-2	జైలర్(తెలుగు)-12.15 3.40 7.05 10.30
స్క్రీన్-3	జైలర్(తెలుగు)-11.15 2.40 6.05 9.30
స్క్రీన్-4	బేబి(తెలుగు)-12.05 3.35 10.00 - బ్రో(తెలుగు)-7.05